సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం, 1, ఏప్రిల్, 2024



నిప్పు.. కారాదు పెనుముప్పు

ముందస్తు జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చునని అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు.

8లో



భక్తులకు ప్రసాద వితరణ

రొళ్ల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం భూతప్ప ఆలయం వద్ద ప్రసాద వితరణ జరిగింది.

8లో

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 4.58



న్యూస్‌రీల్

కరుణామయుడు ఏసు



కింగ్స్‌చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

పుట్టపర్తి టౌన్: లోకరక్షకుడైన ఏసు సమాధి నుంచి పునరుత్థానం చెందిన పవిత్రమైన ఈస్టర్ దినాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చిల్లోనూ ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏసు మార్గంలో నడవాలని, సాటి మనుషుల పట్ల ప్రేమ, కరుణ, చూపాలని మత పెద్దలు సందేశాలు ఇచ్చారు. పుట్టపర్తిలోని కింగ్స్, హోలిసిటీ, షాలోమ్ చర్చిల్లో ఈస్టర్ డే ను పాస్టర్ అరుణ్‌కుమార్, రాజారత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు.

'నవోదయ' ఫలితాలు విడుదల

లేపాక్షి: నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం సాయంత్రం విడుదలైనట్లు లేపాక్షి నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 8,857 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 4,871 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. వీరిలో ప్రతిభ కనబరచిన 79 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

రాజ్య పురస్కార్ క్యాంప్ ప్రారంభం



శిబిరంలో పాల్గొన్న స్కౌట్ విద్యార్థులు

హిందూపురం టౌన్: బాలబాలికల్లో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమని ఆ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే అత్యున్నత రాజ్య పురస్కార్ టెస్టింగ్ శిబిరాన్ని ఆదివారం హిందూపురం సమీపంలోని పూలకుంట ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు పతాకావిష్కరణ చేసి, మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుంచి 80 మంది స్కౌట్ విద్యార్థులు శిబిరానికి హాజరయ్యారన్నారు. ఈ నెల 4వ తేదీ వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలను రాష్ట్ర గవర్నర్ అందజేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేశవమూర్తి, స్కౌట్ సెక్రటరీలు వెంకటరమణప్ప, గిరిధర్, బొమ్మయ్య, రాష్ట్ర పరిశీలకులు నాగరాజు గుప్తా, డీఓసీలు నాగరాజు, లక్ష్మన్న, స్కౌట్ మాస్టర్లు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి



కచేరి నిర్వహిస్తున్న అనంతపురం విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి ప్రేమ తత్వాన్ని కొనియాడుతూ సత్యసాయి విద్యాసంస్థల అనంతపురం క్యాంపస్ విద్యార్థులు ప్రేమకు ప్రేమతో పేరుతో నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. సత్యసాయిపై తమకున్న భక్తిని చాటుతూ ఆలపించిన గీతాలు భక్తులను సమ్మోహన పరిచాయి.

సమరోత్సాహం



- నేడు సంజీవపురం నుంచి సీఎం బస్సు యాత్ర
- కదిరిలో ఇఫ్తార్ విందుకు హాజరు కానున్న సీఎం వైఎస్ జగన్
- ఆత్మీయ స్వాగతం పలికేందుకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. సిద్ధం సభలు.. మేమంతా సిద్ధం బస్సు యాత్రతో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. సభలు.. రోడ్‌షో.. కార్యక్రమం ఏదైనా ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. సంక్షేమ పాలనకు జై కొడుతున్నారు. సమరోత్సాహంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కుతున్నాయి.

సాక్షి, పుట్టపర్తి

సంక్షేమ పాలన ధ్యేయంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాక సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా సోమవారం ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో సీఎం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. తమ నాయకుడిని ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఎదురుచూస్తున్నారు. జగన్‌ను నేరుగా చూసేందుకు వృద్ధులు, వికలాంగులు, మహిళలు, యువకులు ఉత్సాహంగా తరలి రానున్నారు. దారి పొడవునా స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. కదిరి పట్టణంలోకి ప్రవేశించగానే అపూర్వ స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.

ముస్లింలకు పెద్దపీట

'బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలందరు నా వాళ్లే' అని చెప్పే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అదే మాట ప్రకారం ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున అసెంబ్లీ, పార్లమెంటు టికెట్లు కేటాయించారు. కదిరి అసెంబ్లీ స్థానం నుంచి ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన బీఎస్ మక్బూల్ అహ్మద్‌కు అవకాశం కల్పించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. అంతేకాకుండా 2014 ఎన్నికల్లోనూ కదిరి సీటును అత్తార్ చాంద్‌బాషాకు కేటాయించారు. ఇక్కడ మళ్లీ 2024లోనూ ముస్లిం మైనార్టీకే అవకాశం ఇచ్చారు. అదేవిధంగా 2019లో హిందూపురం అసెంబ్లీ టికెట్‌ను ఇక్బాల్ అహ్మద్‌కు ఇచ్చారు. ప్రతి ఎన్నికలోనూ జిల్లాలో ముస్లింలకు ఒక సీటు కచ్చితంగా ఇస్తున్నారని ఆ వర్గం ప్రజలు సంతోషంగా ఉన్నారు.

కదిరిలో టీడీపీకి షాక్

2014లో కదిరి నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన అత్తార్ చాంద్‌బాషా తర్వాత టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. కాగా.. టీడీపీలో ముస్లింలకు తగిన ప్రాధాన్యం లేదని.. చేసిన తప్పు సరిదిద్దుకుని తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు అత్తార్ చాంద్‌బాషా ప్రకటించారు. టీడీపీకి రాజీనామా చేశారు. సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరనున్నట్లు ప్రకటించారు.

'అనంత'లో సూపర్ సక్సెస్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర అనంతపురం జిల్లాలో సూపర్ సక్సెస్ అయ్యింది. శనివారం గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల మీదుగా సాగిన యాత్రకు జనం పోటెత్తారు. మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఐదారు గంటలు నిలబడి, తమ అభిమాన నేతను చూడగానే ఉదయం నుంచి పడిన కష్టాన్ని అందరూ ఒక్క నిమిషంలో మర్చిపోయారు. సీఎం జగన్ రోడ్‌షోను చూసేందుకు ప్రజలు, మహిళలు సాయంత్రం 5 నుంచే దారి పొడవునా బారులుదీరారు. రాత్రి 11.30 గంటలైనా రోడ్‌షో వెంబడి జనప్రవాహం కనిపించింది. వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన తాము ఎన్ని గంటలైనా జగన్‌ను చూశాకే ఇంటికెళతామని చెప్పడం ఆయనపైన ప్రజలకున్న అభిమానానికి నిదర్శనం. అనంతపురం జిల్లాలో 75 కిలోమీటర్ల బస్సు యాత్రకు 8 గంటల సమయం పట్టిందంటేనే జనాభిమానం ఎంతలా ఎగిసిపడిందో చెప్పవచ్చు. శ్రీసత్యసాయి జిల్లాలోనూ బస్సుయాత్ర అదే రీతిలో కొనసాగుతుందనడంలో సందేహం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

నేటి బస్సు యాత్ర ఇలా..

బత్తలపల్లి మండలం సంజీవపురంలో బస చేసిన కేంద్రం నుంచి సీఎం జగన్ సోమవారం ఉదయం 9 గంటలకు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర కొనసాగిస్తారు. అనంతరం బత్తలపల్లి, రామాపురం, కట్టకిందపల్లి, రాళ్ల అనంతపురం, ముదిగుబ్బ, ఎన్ఎస్‌పీ కొట్టాల, మలకవేముల మీదుగా పట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి నడింపల్లి, కాళసముద్రం, ఎర్రదొడ్డి, కుటాగుళ్ల వరకు యాత్ర సాగుతుంది. కుటాగుళ్లలో మధ్యాహ్న భోజన విరామం తీసుకుంటారు. అక్కడి నుంచి కదిరి పట్టణంలోకి ప్రవేశిస్తారు. పీవీఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ముస్లింల ఇఫ్తార్ విందులో సీఎం పాల్గొంటారు. తర్వాత మొటుకపల్లి, జోగన్నపేట, ఎస్ ములకలపల్లె మీదుగా చీకటిమానేపల్లికి చేరుకుని అక్కడే బస చేస్తారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

- సచివాలయాల వద్దే అందజేత

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం సామాజిక భద్రత కింద అందించే వైఎస్సార్ పెన్షన్ కానుకను ఈ నెల మూడో తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగింపు కావడం, ఏప్రిల్ 1న బ్యాంకులకు సెలవు ఉండడం ఈసారి పింఛన్ల పంపిణీ ఆలస్యానికి ప్రధాన కారణం. ఎన్నికల వేళ వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేయకుండా చూడాలని టీడీపీ ప్రేరేపిత వ్యక్తులు కోర్టును ఆశ్రయించినందున ఈసారి సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీలు సచివాలయాల వద్దే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

పింఛన్ పంపిణీకి వలంటీర్ల దూరం టీడీపీ కుట్రే

- ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి ధ్వజం



ధర్మవరం: తెలుగుదేశం పార్టీ కుట్ర కారణంగానే వలంటీర్లు పింఛన్ల పంపిణీకి దూరం కావాల్సి వచ్చిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. ఇంటి వద్దనే తీసుకునే పింఛన్లను సచివాలయాల వద్దకెళ్లి అధికారుల ద్వారా తీసుకోవాల్సి వస్తోందన్నారు. ఆదివారం ఆయన ధర్మవరంలోని తన నివాసంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ముంగిటకే ప్రభుత్వ సేవలు తీసుకురావడాన్ని తొలినుంచి టీడీపీ, జనసేన వ్యతిరేకిస్తూనే ఉన్నాయన్నారు. ప్రజలకు సత్వర సేవలు అందకూడదని, ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని కుట్రలు పన్నుతున్నాయన్నారు. అందులో భాగమే నిమ్మగడ్డ రమేష్ చౌదరి టీడీపీకి అనుబంధంగా పనిచేస్తూ వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకుండా పాత పద్ధతిలోనే కార్యాలయాలకు వెళ్లి అధికారుల వద్ద పింఛన్ తీసుకునేలా చేశారన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టడానికే చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. కరోనా- వరదలు వంటి విపత్తు సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించి మన్ననలు పొందారని గుర్తు చేశారు. అలాంటి వ్యవస్థపై టీడీపీ అధినేత కక్ష కట్టారని విమర్శించారు. పథకాల వల్ల ప్రజలు సోమరులు అవుతారనే భావన ఆయనలో వేళ్లూనుకుపోయిందన్నారు.

బాబుకు ఉసురు తగులుతుంది

- వలంటీర్ల సేవలకు బ్రేక్‌పై ఎమ్మెల్యే దుద్దుకుంట ఫైర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి : తెల్లవారుజాము నుంచే ఇంటి తలుపు తట్టి పింఛన్ అందించే వలంటీర్లను ఎన్నికల పేరుతో విధులకు దూరంగా పెట్టించినందుకు అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు తదితరుల ఉసురు ప్రతిపక్ష నేత చంద్రబాబుకు కచ్చితంగా తగులుతుందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందించే వలంటీర్ల సేవలను ఓర్వలేక ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ రెండోసారి అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు.

కియా పరిశ్రమ చంద్రబాబు అబ్బ సొత్తుకాదు

ప్రతిసారి కియా పరిశ్రమ తానే తెచ్చానని చంద్రబాబు చెబుతుంటారని.. పరిశ్రమ ఏమీ వాళ్ల అబ్బ సొత్తు కాదని ఎమ్మెల్యే దుద్దుకుంట విమర్శించారు. టీడీపీ హయాంలో ఇక్కడ కొరియా వాళ్లే ఉద్యోగులుగా ఉండే వారని, సీఎం జగన్ స్థానికంగా 70 శాతం మందికి అవకాశం కల్పించాలనే నిబంధన పెట్టారని ఇప్పుడు స్థానికులు ఉద్యోగాలు చేసుకుంటున్నారని వివరించారు.

పల్లె గిమ్మిక్కులు పనిచేయవు

మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి తన కోడలు సింధూరరెడ్డిని ఎలాగైనా గెలిపించుకునేందుకు చేస్తున్న గిమ్మిక్కులు ఏమాత్రమూ పని చేయవని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అన్నారు. పార్టీలో ఒకరో ఇద్దరో చేరితే వందల కుటుంబాలు చేరినట్లు ప్రచారాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీలోకి వందలాది కుటుంబాలు చేరుతున్నాయని, రానున్న రోజుల్లో మరింత ఎక్కువగా చేరికలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో పుట్టపర్తి పట్టణ, రూరల్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు రంగారెడ్డి నరసారెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నల్లమాడ ఎంపీపీ సునీతాబాయి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, కౌన్సిలర్ సూర్యాగౌడ్, బుక్కపట్నం మండల సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, చౌటకుంటపల్లి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీవారి అలుకోత్సవం



అలుకోత్సవ విశిష్టతను వివరిస్తున్న అర్చకులు

కదిరి: బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీ నరసింహస్వామి అలుకోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. అనంతరం స్వామి వారు అశ్వవాహనంపై తిరువీధుల్లో తన భక్తులకు దర్శనమిచ్చారు. చతురంగ బలాలలో అత్యంత ప్రధానమైనది అశ్వ బలం. కలియుగాంతంలో శ్రీవారు అశ్వవాహనంపై వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తారని చాటి చెప్పడం కోసమే నారసింహుడు అశ్వవాహనంపై ఊరేగుతారని వేద పండితులు వివరించారు. యాగశాలలో నిత్య హోమం గావించిన మీదట శ్రీవారు విశేషాలంకరణతో ఆలయానికి సమీపంలో ఉన్న సుద్దుల మండపం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న భక్తులు 'శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి గోవిందా..గోవింద' నామస్మరణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చక పండితులు బ్రహ్మోత్సవాలు, అలుకోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. అన్ని ఉత్సవాలకు ఉభయదారులుగా భక్తులు వ్యవహరిస్తే ఆనవాయితీ ప్రకారం అలుకోత్సవానికి ఆలయ సహాయ కమిషనర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పేద కుటుంబాలకు పెద్ద దిక్కు



ఈమె పేరు లక్ష్మమ్మ.రొళ్ల మండలం మల్లసముద్రం గ్రామం. వీరికి అర ఎకరా వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయం కలిసి రాకపోవడంతో కూలి పనులకెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. భర్త తిప్పేస్వామి ఏడాది క్రితం మరణించారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితిలో ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ బీమా పథకం ఈ కుటుంబాన్ని ఆదుకుంది. లక్ష్మమ్మకు వైఎస్సార్‌బీమా పథకం కింద రూ.లక్ష అందింది. అలాగే వితంతు పింఛన్ మంజూరైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో కష్టాల నుంచి బయటపడ్డానని ఎంతో ఆనందంగా చెబుతోంది లక్ష్మమ్మ.

- వైఎస్సార్ బీమాతో బాధితులకు భరోసా
- ఐదేళ్లలో జిల్లాలో 723 కుటుంబాలకు రూ.40.86 కోట్ల చెల్లింపు



మడకశిర మండలం రేకులకుంట జయపద్మకు వైఎస్సార్ బీమా సాయమందిస్తున్న అధికారులు (ఫైల్)

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతోంది. పెద్ద దిక్కు ఆకస్మిక మరణంతో కుదేలవుతున్న కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ఆసరాగా నిలుస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) కుటుంబాలకే ఈ పథకం వర్తిస్తుంది. బీమా ప్రీమియం కూడా ప్రభుత్వమే భరిస్తోంది. కుటుంబ పెద్ద సాధారణ మరణం పొందితే ఈ పథకం కింద కుటుంబానికి రూ.లక్ష అందిస్తుంది. ప్రమాదంలో మరణిస్తే రూ.5లక్షలు చెల్లిస్తుంది. పరిహారం చెల్లింపు కూడా త్వరగా అందుతుండటం బాధిత కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతోంది.

జిల్లాలో రూ.40.86 కోట్ల చెల్లింపు

వైఎస్సార్ బీమా పథకం కింద జిల్లాలో వందలాది కుటుంబాలు లబ్ధి పొందాయి. గడిచిన ఐదేళ్లలో ఇప్పటి వరకు 723 కుటుంబాలకు రూ.40.86 కోట్ల పరిహారం అందింది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే కదిరిలో 118 మందికి రూ.6.52 కోట్లు, ధర్మవరంలో 118 మందికి రూ.6కోట్లు, పుట్టపర్తిలో 106 మందికి రూ.5.83 కోట్లు, హిందూపురంలో 113 మందికి రూ.6.26 కోట్లు, మడకశిరలో 115 మందికి రూ.6.06 కోట్లు, పెనుకొండలో 111 మందికి రూ.7.03 కోట్లు, రాప్తాడులో 55 మందికి రూ.3.16 కోట్ల చొప్పున వైఎస్సార్ బీమా సాయం మంజూరు చేసి ఆయా కుటుంబాల సభ్యులకు అందజేసింది. పెద్దలను కోల్పోయిన కుటుంబాల్లో వైఎస్సార్ బీమా వెలుగులు నింపింది.

ఆదుకున్న వైఎస్సార్ బీమా



నా భర్త రామప్ప అనారోగ్యంతో మృతి చెందారు. ప్రభుత్వం వెంటనే వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష అందించింది. ఏమాత్రం జాప్యం చేయకుండా ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన ఈ సాయాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటా.

– రమ్య, రత్నగిరి, రొళ్ల మండలం

జగన్ మాపాలిట దేవుడు



ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మాపాలిట దేవుడు. నా భర్త అనారోగ్యంతో మృతి చెందారు. దిక్కు తోచనిస్థితిలో ఉన్నప్పుడు వైఎస్సార్ బీమా పథకం కింద ప్రభుత్వం రూ.లక్ష అందించింది. భర్త చనిపోయిన కొన్ని రోజులకే ప్రభుత్వం నుంచి బీమా రావడంతో ఆర్థికంగా ఎంతో ఊరట లభించింది. అధికారులు కూడా ఏమాత్రం జాప్యం చేయకుండా బీమా అందించి అండగా నిలిచారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రి మాలాంటి పేదలకు ఎంతో అవసరం.

– లక్ష్మమ్మ, రత్నగిరి, రొళ్ల మండలం

రేపటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి తీర్థవాది ఉత్సవం సోమవారం భృగుతీర్థంలో భక్తుల కోలాహలం మధ్య జరగనుంది. ఉదయం ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవిల సమేతంగా స్వామి వారు వసంతోత్సవాలు జరుపుకుంటారు. అనంతరం శ్రీదేవి, భూదేవిలతో కలిసి శ్రీవారు భృగుతీర్థంలోకి వెళ్లి అక్కడ చక్ర స్నానం ఆచరిస్తారు. అనంతరం విశేషాలంకరణతో తిరువీధుల గుండా తిరిగి ఆలయం చేరుకుంటారు.

నేడు ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాల ప్రారంభం (మార్చి 19) నాడు ఆలయం ముందు ధ్వజ స్తంభానికి కట్టిన కంకణాలు సోమవారం విప్పేస్తారు. అంటే ధ్వజావరోహణం గావిస్తారు. దీంతో తీర్థవాది ఉత్సవం ముగుస్తుంది. అనంతరం శ్రీవారు మధ్యాహ్నం రెండు గంటలకు ఆలయంలోకి ప్రవేశిస్తారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి స్వామివారు యాగశాలలోనే గడిపారు. నేటి మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం తలుపులు మూసివేస్తారు. అప్పటి నుంచి ఒక రోజంతా శ్రీవారి దర్శనం ఉండదు. తిరిగి మంగళవారం (రెండో తేదీ) ఉదయం నుంచి స్వామివారు ఆలయంలో యథావిధిగా తన భక్తులకు దర్శనమిస్తారు. అదే రోజు రాత్రి ఆలయ ప్రాంగణంలో పుష్పయాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

క్లుప్తంగా

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

అనంతపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర సోమవారం నుంచి శ్రీసత్యసాయి జిల్లాలో కొనసాగనుంది. ఈ క్రమంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు డీఐజీ ఆర్‌ఎస్ అమ్మిరెడ్డి వెల్లడించారు. శనివారం అనంతపురం జిల్లాలోకి ప్రవేశించిన బస్సు యాత్ర మొత్తం 75 కిలోమీటర్ల మేర సాగింది. లక్షలాది మంది ప్రజలు సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చారు. 44వ జాతీయ రహదారి పొడుగునా సీఎం వైఎస్ జగన్‌కు జనం నీరాజనం పలికారు. అంచనాలకు మించి జనం తరలి రావడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లాలో ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన ప్రదేశాల్లో సక్రమంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి డీఐజీ ఆర్‌ఎస్ అమ్మిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు



చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సరిహద్దు చెక్‌పోస్టుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రధాన చెక్‌పోస్టులతో పాటు రహదారుల ప్రధాన కూడళ్లు, బస్టాండ్ ప్రాంతాల్లో బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు.

అడవి పిల్లి దాడిలో ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి: అటవీ ప్రాంతం నుంచి ఆహారం కోసం ఇళ్లలోకి చొరబడిన ఓ అడవి పిల్లి దాడిలో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని డి.చెర్లోపల్లిలో ఆదివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చల్లా పెద్దన్న ఉదయాన్నే ఇంట్లో పూజాదికాలు నిర్వహిస్తుండగా ఉన్నఫళంగా అడవిపిల్లి లోపలికి ప్రవేశించింది, గమనించిన పెద్దన్న గట్టిగా కేకలు వేయడంతో బెదిరిపోయి అతని ముఖంపై దాడి చేసింది. అనంతరం పక్కనే ఉన్న చల్లా శ్యామలమ్మ ఇంట్లోకి చొరబడి ఆమె చేతులను గాయపరిచింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు అప్రమత్తమై అడవి పిల్లిని చంపేశారు. క్షతగాత్రులు ఆర్డీటీ ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందారు.

నిప్పు ... కారాదు పెను ముప్పు

- వేసవిలో అగ్నిప్రమాదాలతో జాగ్రత్త
- అవగాహనతోనే ప్రమాదాల నివారణ
- అప్రమత్తంగా ఉండాలంటున్న ఫైర్ అధికారులు



మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా చిన్నపాటి తప్పిదాలతో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉంది. దీంతో ఆస్తి, ప్రాణ నష్టం కలుగుతుంది. ముందస్తు జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చునని రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ అధికారులు అంటున్నారు.

అగ్ని ప్రమాదానికి కారణాలు ఇవే...

పట్టణాల్లో అధికాతం అగ్ని ప్రమాదాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే చోటు చేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కట్టెల పొయ్యిలు, ఎవరైనా బీడీలు, సిగరెట్లు తాగి ఆర్పకుండా అలాగే పడేయడంతో జరుగుతున్నాయి. ఎక్కడైనా అగ్గి భగ్గుమంటే వెంటనే ఎవరో ఒకరు 'ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయండి' అంటారు. మంటలను అదుపులోకి తెచ్చి ప్రమాదాలను అగ్ని మాపక కేంద్రం నివారిస్తుందనేది ప్రజల ధీమా. ఏ చిన్న అగ్ని ప్రమాదం సంభవించినా పెనుముప్పుగా మారే అవకాశం లేకపోలేదు. కళ్లు మూసి తెరిచేలోపే ఆస్తులు బూడిదవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా సంభవిస్తోంది. కాసింత ఏమరుపాటుతో చిన్న తప్పిదాలకే రూ.లక్షల్లో ఆస్తులు, విలువైన ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే డయల్ 101కు కాల్ చేసి సంబంధిత ప్రమాద, చిరునామా వివరాలు తెలియజేస్తే వెంటనే అగ్ని మాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పుతుంది.

101 ద్వారా అందే సేవలు

ఫైర్ స్టేషన్ అంటే కేవలం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కాల్ చేయాలని చాలా మంది అనుకుంటారు. కానీ డయల్ 101 నుంచి చాలా సేవలు పొందవచ్చు. అగ్ని ప్రమాదాలతో పాటు ఎలాంటి విపత్కర పరిస్థితులు సంభవించినా వెంటన్ డయల్ 101కు కాల్ చేసి సాయం కోరవచ్చు. నీళ్లలో మనుషులు పడినా.. ఇల్లు లేదా పాఠశాలల్లో పాములు దూరినా.. ఎవరైనా రోగి భారీకాయంతో ఉన్న సమయంలో సదరు కుటుంబ సభ్యులు 101కు కాల్ చేసి ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సాయం కోరవచ్చు. అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణ తదితర అంశాలపై ఏటా వారోత్సవాల పేరుతో ఆ శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో గత మూడేళ్లలో జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాల సంఖ్య తగ్గుతూ వస్తోంది.

జిల్లాలో ఆరు ఫైర్ స్టేషన్లు

జిల్లా వ్యాప్తంగా పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, మడకశిర, ధర్మవరం, కదిరిలో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 2023, ఏప్రిల్ 1 నుంచి 2024, మార్చి31 రకూ చిన్న, పెద్ద కలుపుకుని మొత్తం 260 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రూ.2,55,53,500 మేర ఆస్తి నష్టం సంభవించింది. సకాలంలో సమాచారం అందివ్వడంతో రూ. 12,50,47,000 ఆస్తి నష్టాన్ని అగ్నిమాపక సిబ్బంది నివారించగలిగింది. అలాగే ఇద్దరు మనుషులు, రెండు పశువులను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

వెంటనే సమాచారం ఇవ్వండి



వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఈ నెల 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నాం. ఏటా ఏప్రిల్‌లో వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. సరైన సమయంలో సమాచారం చేరవేస్తే ఆస్తి, ప్రాణ నష్టం తగ్గించేందుకు వీలుంటుంది. ప్రమాదం జరిగిన వెంటనే డయల్ 101కు సమాచారం ఇవ్వాలి. – నాగరాజునాయక్, డీఎఫ్‌ఓ

గత ఐదేళ్లుగా జరిగిన అగ్ని ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాల సంఖ్య	నష్టం (రూ.కోట్లలో)
2019-20	309	రూ3,26,45,600
2020-21	432	రూ.1,66,53,900
2021-22	270	రూ.2,48,70,000
2022-23	264	రూ.2,45,80,900
2023-24 మార్చి వరకు	260	రూ.2,55,53,500

జిల్లాలో ఫైర్ స్టేషన్ల ఫోన్ నంబర్లు

అగ్నిమాపక కేంద్రం	ల్యాండ్ నంబర్	మొబైల్ నంబర్
ధర్మవరం	08559-220626	99637 40213
హిందూపురం	08556-220888	99637 39702
కదిరి	08494-224266	73373 95556
మడకశిర	08493-288101	99637 40643
పెనుకొండ	08555- 220299	99667 40127
పుట్టపర్తి	08555-287299	99637 40363

తేనెటీగల దాడిలో నలుగురికి గాయాలు

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం వాకింగ్ చేస్తున్న పలువురిపై తేనెటీగలు దాడి చేశాయి. కొందరు ఆకతాయిలు చెట్టుపై ఉన్న తేనె తుట్టెపై రాళ్లు రువ్వారు. దీంతో తేనెటీగలు ఒక్కసారిగా చెలరేగి వాకింగ్ చేస్తున్న వారిని చుట్టుముట్టాయి. వారు పరుగులు తీసినా ఫలితం లేకపోయింది. తేనెటీగలు వెంబడించి కుట్టడంతో రామాంజినేయులు, బాబు, యోగేంద్రనాథ్, సంపత్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



మృతురాలు రాజేశ్వరి

ధర్మవరం అర్బన్: కడుపు నొప్పి తాళలేక బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీలో నివాసముంటున్న చింతా చిదంబరయ్య, శారద దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె రాజేశ్వరి (21) ఉన్నారు. పుట్టపర్తిలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో రాజేశ్వరి బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. శనివారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసిన తర్వాత రాజేశ్వరి మొదటి గదిలో నిద్రపోయింది. ఆదివారం ఉదయం ఎంత సేపటికీ ఆమె బయటకు రాకపోవడంతో తండ్రి గదిలోకి వెళ్లి చూశాడు. అప్పటికే చీరతో వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రాజేశ్వరిని గమనించి కుమారుడి సాయంతో కిందకు దించి పరిశీలించాడు. మృతి చెందినట్లుగా నిర్ధారించుకున్న తల్లిదండ్రుల వేదనకు అంతు లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, చిదంబరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీకి అండగా నిలుద్దాం

- ఏపీ శాలివాహన కుమ్మర కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి



మాట్లాడుతున్న మండేపూడి పురుషోత్తం

బత్తలపల్లి: ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో కుమ్మర వర్గీయులు రూ.కోట్లలో లబ్ధి పొందారని ఏపీ శాలివాహన కుమ్మర కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం తెలిపారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీని మరో గెలిపించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను చేసుకుందామని పిలుపునిచ్చారు. బత్తలపల్లిలోని శ్రీకోటి సాయిలిఫి డిగ్రీ కళాశాలలో కుమ్మర శాలివాహన డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా మండేపూడి పురుషోత్తం హాజరై, మాట్లాడారు. 28 పథకాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఐదేళ్లలో 6.25లక్షల మంది కుమ్మరలకు రూ.1,680కోట్ల మేర లబ్ధి చేకూరిందని వివరించారు. సీఎం వైఎస్ జగన్ చొరవ ఫలితంగానే కవయిత్రి మొల్లమాంబ జయంతిని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. మొల్లమాంబ జయంతి డైరీని కూడా టీటీడీ ఆధ్వర్యంలో ముద్రించిందన్నారు. 2025లో కుమ్మర్లకు ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించనున్నట్లు సీఎం వైఎస్ జగన్ భరోసానిచ్చారన్నారు. ధర్మవరంలో 1984లో కుమ్మర్లకు ఐదు ఎకరాల అప్పటి ప్రభుత్వం కేటాయించగా, తర్వాత ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించారని, విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. త్వరలో ఈ స్థలాన్ని కుమ్మర్లకు ప్రభుత్వం అప్పగించనుందన్నారు. సమావేశంలో కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షుడు, ధర్మవరం మున్సిపల్ కౌన్సిలర్ జేసీబీ రమణ, జలాలపురం పోతులయ్య, శాలివాహన కుమ్మర వెల్ఫేర్ కమిటీ సభ్యులు బత్తలపల్లి వెంకటరమణ, పరిగి నాగరాజు, కొనకొండ్ల అంజి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఎన్నికల వ్యయం

- అసెంబ్లీకి రూ.40 లక్షలు
- పార్లమెంట్‌కు రూ.95 లక్షలు

హిందూపురం అర్బన్: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన మార్చి 16న ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో పోటీ చేసే అభ్యర్థులు ఇష్టారీతిన నగదు ఖర్చు పెట్టడానికి వీలు లేకుండా పోయింది. సభలు, ర్యాలీలు, భోజనాలు, వాహనాల ఏర్పాటు తదితర ఎన్నో ఖర్చులకు సంబంధించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని పక్కాగా అమలు చేసేందుకు అధికారులు, తనిఖీ బృందాలు ఆయా నియోజక వర్గాల్లో పని చేస్తున్నాయి. నామినేషన్ వేసే సమయంలో పార్టీల అభ్యర్థులు మారితే అప్పటి వరకూ చేసిన ఖర్చును పార్టీ ఖాతాలోకి లెక్కిస్తారు.

నామినేషన్ నుంచి లెక్క..

- అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసినప్పటి నుంచి ఖర్చు లెక్కిస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహించాలి. అభ్యర్థి ఖర్చులను ఎన్నికల పరిశీలకులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు.
- 1952 సాధారణ ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థి వ్యయం రూ.లక్ష ఉండేది. 1962లో రూ.3లక్షలు, 1975లో రూ.5లక్షలకు చేరింది. 1984లో రూ.10 లక్షలకు, 2014లో రూ.28లక్షలు, ప్రస్తుత ఎన్నికల్లో రూ.40 లక్షలకు చేరింది. ఇక పార్లమెంట్ అభ్యర్థి రూ.95 లక్షలు ఖర్చు చేయవచ్చు.
- ఓటర్లను ప్రలోభ పెట్టడంలో భాగంగా అభ్యర్థులు ఎలాంటి ఖర్చు చేయరాదు. తనిఖీల్లో పట్టుబడిన నగదు, గిఫ్ట్ సామగ్రి అభ్యర్థిదని తేలితే వారి ఖాతాల్లోకి వ్యయాన్ని చేరుస్తారు. పార్టీల జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పోస్టర్లు, వాహనాల బాడుగ, సభా వేదికలు, మైకులు, పత్రికలకు యాడ్‌లు, సోషియా మీడియా ప్రకటనలు సైతం అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగానే లెక్కిస్తారు. ప్రతి రూపాయికీ లెక్క చూపాల్సిందే.

ద్విచక్రవాహనాలు ఢీ - ఇద్దరి మృతి



వినోద్‌కుమార్ (ఫైల్)

గోరంట్ల: మండలంలోని గుంతపల్లి సమీపంలో నిషా గార్మెంట్స్ వద్ద ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. వీరిలో ఒకరు గ్రామ వలంటీర్ కాగా, మరొకరు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టగుండ్లపల్లికి చెందిన వినోద్‌కుమార్ (29) ఆదివారం రాత్రి గోరంట్ల నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పుట్టపర్తి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నాగప్ప (65) ఢీకొన్నాడు. వినోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నాగప్పను 108 అంబులెన్స్‌లో తొలుత గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి, అనంతరం హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆయన కూడా మృతి చెందారు. కాగా, వినోద్‌కుమార్ పుట్టగుండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీ - ఒకరి మృతి



ఢీ కొట్టిన లారీ

మడకశిర రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఒకరు దుర్మరణం పాలయ్యారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం తాలూకాలోని గౌరిపురం గ్రామానికి చెందిన శంకరప్ప, వన్నూరప్ప ఆదివారం సాయంత్రం ఒకే ద్విచక్ర వాహనంపై మడకశిర మండలం అచ్చంపల్లి వైపు బయలుదేరారు. ఆమిదాల గొంది సమీపంలోని ఎగువ అచ్చంపల్లి రోడ్డుపై ప్రయాణిస్తుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బియ్యం లోడు లారీ ఢీకొంది. ఘటనలో శంకరప్ప (48) అక్కడికక్కడే మృతి చెందాడు. వన్నూరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పావగడ తాలూకాలోని రాజవంతి గ్రామంలో బంధువుల ఇంట వైకుంఠ సమారాధన కార్యక్రమంలో పాల్గొని వారు ద్విచక్ర వాహనంపై రొప్పాలకు వెళుతున్నట్లుగా తెలిసింది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సీయూఈటీ యూజీ దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీల్లో యూజీ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే సీయూఈటీ- యూజీ - 2024 దరఖాస్తు గడువు పొడిగించారు. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆదివారంతో దరఖాస్తు గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ రాత్రి 9:50 గంటల వరకూ పొడగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలుగు సహా 13 భాషల్లో మే 15 నుంచి ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామిని బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేపట్టారు. ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతి దేవికి పూజల అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'మేనిఫెస్టో'కు మార్గదర్శకాలు

- రాజకీయ పార్టీలకు ఈసీ స్పష్టమైన సూచనలు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో తమ పార్టీ మేనిఫెస్టోని రాజకీయ పక్షాలు విడుదల చేయడం సర్వసాధారణం. అయితే మేనిఫెస్టోను రూపొందించే క్రమంలో రాజకీయ పార్టీలు అనుసరించాల్సిన మార్గదర్శకాలను ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సూచించింది. ప్రధానంగా సుప్రీం కోర్టు తీర్పు మేరకు మేనిఫెస్టో ఉండాలని మార్గదర్శకాలు జారీ చేసింది.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు

- రాజ్యాంగంలో పేర్కొన్న ఆదర్శాలను, సూత్రాలను ఉల్లంఘించేలా ఎలాంటి అంశాలను ఎన్నికల మేనిఫెస్టోలో ఉంచరాదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా మేనిఫెస్టో ఉండాలి.
- రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో ప్రభుత్వ విధానాలు ప్రజల కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేలా మేనిఫెస్టో ఉండవచ్చు. అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు సంబంధించిన హామీలను ఎన్నికల మేనిఫెస్టోలో ఉంచడంపై ఎలాంటి అభ్యంతరం లేదు కానీ, రాజకీయపార్టీలు ఎన్నికల ప్రక్రియలోని పారదర్శకతను అతిక్రమించేలా లేదా ఓటర్లపై ప్రభావం చూపేలా తమ మేనిఫెస్టోలో ఎలాంటి హామీలు ఇవ్వకూడదు.
- ఆయా స్థాయిల వారి కోసం అందించేవి, పరపతితో కూడిన హామీలవంటి వాటి పారదర్శకత కోసం ఎన్నికల మేనిఫెస్టోలో ఆయా హామీలను హేతుబద్ధంగా నిలబెట్టుకునేందుకు ఉన్నటువంటి మార్గాలను, వాటిని నెరవేర్చేందుకు కావాల్సిన ఆర్థిక వనరులు వంటి వాటిని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతిబింబించాలి. నేరవేర్చిన హామీల ద్వారా మాత్రమే ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని రాబట్టుకోవాలి.

టీడీపీ ప్రచారంలో ఉపాధ్యాయుడు



చేనేపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు రంగారెడ్డి (వృత్తంలోని వ్యక్తి)

హిందూపురం: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ తరపున ఓ ఉపాధ్యాయుడు ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటున్నారు. ఇందు కోసం ఏకంగా రెండు నెలల పాటు సెలవు పెట్టినట్లు తెలిసింది. వివరాలు... చిలమత్తూరు మండల టీడీపీ మాజీ కన్వీనర్ రంగారెడ్డి... ఇటీవల 1998 డీఎస్సీలో అర్హత సాధించిన వారికి జగన్ సర్కార్ ఉద్యోగ అవకాశాలు కల్పించినప్పుడు హిందూపురం మండలం వడ్డిపల్లి గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అనంతరం నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన రాదు. అయితే రంగారెడ్డి ఏకంగా రెండు నెలల పాటు సెలవు పెట్టి టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ తరపున ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటూ ఎన్నికల నియమావళిని ధిక్కరించడం వివాదాస్పదమైంది. టీచర్ వైఖరిపై ఎన్నికల అధికారులు దృష్టి సారించాలని ఈ సందర్భంగా పలువురు కోరుతున్నారు.

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

కూడేరు: స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన కూడేరు శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వరుడి రథోత్సవం నిర్వాహణపై ఆదివారం ఆలయ ధర్మకర్త కిష్టప్ప అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17 నుంచి 26 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేలా ఆలయ పురోహితుడు శివశంకరశాస్త్రి నిర్ణయించారు. 23న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తెలిపారు. త్వరలోనే బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అలివేలమ్మ, శ్రీనివాసులు, శంకరరెడ్డి, గ్రామ పెద్దలు తిమ్మారెడ్డి, ఓబుళప్ప, ప్రవీణ్ స్వామి, మల్లికార్జున, రమేష్, వెంకటయ్య , సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భక్తులకు ప్రసాద వితరణ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్



భూతప్పస్వామి ఆలయం వద్ద నైవేద్యంగా ఉంచిన ప్రసాదం

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భూతప్ప ఆలయం వద్ద 101 ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం వేకువజామున ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహించి, వెండి, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలు, పూలతో అలంకరణ చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా మేళతాళాలతో భూతప్పస్వామి ఆలయం వద్దకు చేర్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా హాజరైన భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన బియ్యం, బెల్లం, బ్యాళ్లు ఇతర పదార్థాలతో ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని భూతప్ప ఆలయం వద్ద నైవేద్యంగా ఉంచి, పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. కాగా, సోమవారం సాయంత్రం బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.